# లవ్‌స్టోరీ

## పశ్చిమాల నెలవంక

- కొత్తపల్లి ఆంజనేయశర్మ



సాయంత్రం కాలేజీ నుంచి ఇంటికొచ్చేసరికి కాలనీ అంతా గందరగోళంగా వుంది.

పనిమనిషి చిన్నమ్మ కాలనీ కంతటికీ బట్టలుతికే చంద్రయ్యతో లేచిపోయిందట. చాలా రోజుల నుంచి పనిచేసే అలవాటు పోయిన శరీరాలన్నీ భారంగా కూలబడి సమస్యను దీర్ఘంగా చర్చించుకొంటున్నాయి. "ఆ! పిదపకాలం! పిదప బుద్ధులూనూ!" నిట్టూర్చింది పక్కింటి బామ్మగారు. "ఆ! యిదెంత కాలం సాగుతుంది? దాని మీద మోజు దీరగానే దాన్నలాగే వదిలి పెట్టడూ! చూడకపోతామా? ఈ కంటికీ రెప్పలడ్డంగావుగా!" దీర్ఘంతీస్తూ బాహాటంగా ప్రోగ్నాస్టికేట్ చేస్తోంది నలుగురికీ చెప్తోంది పై ఫ్లాట్‌లో వుండే ఇంజనీరుగారి భార్య.

'అసలు వీళ్ళకు బుద్ధి లేదు. ఏదో వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారేమో పెళ్ళి చేసుకుందామనుకున్నారు. తిరిగొస్తే సరే. లేకపోతే వేరే వాళ్ళని పెట్టుకోవచ్చు. అంతేకానీ అనవసరపు ప్రసంగాలు చేస్తూ చికాకు తెప్పిస్తారు' విసుగ్గా లోపలికి నడిచాను.

అమ్మ హాల్లో ఎవరితోనో మాట్లాడుతోంది. "రా మైత్రీ! నీ గురించే అనుకుంటున్నాం ఎన్నాళ్ళయిందో నిన్ను చూసి! అబ్బ! ఎంతైనా మా కోడ అందాల రాశి వదినా!" అంటూ గలగలా నవ్వుతూ పలకరించింది సుభద్ర అత్తయ్య. స్టేట్స్ నుంచి సమ్మర్ వెకేషన్‌లో వస్తామని రాశారుకానీ ఇప్పటికి కుదిరింది కాబోలు. అయినా రాగానే అట్లా అనేసరికి వచ్చిన సిగ్గుని సర్దుకొంటూ "మావయ్య రాలేదేంటి?" ముక్తాయింపుగా అన్నాను. పక్కనే శశి కూర్చొని వున్నాడు. అప్పటికీ ఇప్పటికీ మార్పేమీ లేదు 'పప్పుసుద్ద'లా అలానే వున్నాడు. "హాయ్ శశీ!" నేనే పలకరించా! బావలూ, వదినలూ, మరదళ్ళూ వరసలు కలిపి మాట్లాడమంటే నాకు చిరాకు. చిన్నగా నవ్వాడు శశి.

"మావయ్య వచ్చే వారం వచ్చేస్తారమ్మా! అయినా ఆయన మరో ఆర్నెల్లలో రిటైరైపోతున్నారుగదా. ఆఫీసులో బిజీ షెడ్యూల్ వర్క్ ఏదో వుందని ముందు మమ్మల్ని పంపించారు. ఆ తర్వాత ఎలాగూ ఇక్కడే వుంటాం గదా. నెమ్మదిగా చూసుకోవచ్చని ఆయనన్నారనుకో. కానీ ముందు ముందు పుష్కరాలొస్తున్నాయి. అంతకంతకూ ఆలస్యమెందుకని నా వుద్దేశ్యం" కళ్ళల్లోకి చూస్తూ చెప్తోంది సుభద్రఅత్తయ్య.

మాటల్లో ఆవిడభిప్రాయమేదో ద్యోతకమవుతున్నా అర్థం కానట్టు మొహం పెట్టి స్నానం చేయాలని పక్కకి తప్పుకున్నాను. వీళ్ళ అభిప్రాయాలూ, ప్రవర్తనలూ అదోరకం, వెగటుగా వుంటాయి. ఓ మాట్లాడుకోవటం లేదూ, అడగటం లేదూ, ఆ మమ్మీకిచ్చి పెళ్ళి చేసేయమనే వాళ్ళుద్దేశం. అయినా స్టేట్స్‌లో చదివాడన్న మాటేగానీ ఫిలాసఫీలో పిజి తప్పించి మహానుభావుడికా కల్చర్ ఏమాత్రం ఒంటబట్టలేదు. ఉత్త కన్సర్వేటివ్, నా పెళ్ళి గురించి నాక్కొన్ని నిశ్చితాభిప్రాయాలున్నాయి. ఓ మనిషంటే ఇష్టం లేకుండా...పై పెచ్చు ప్రేమ రహిత వివాహాలంటే ఎంత రీజనబుల్‌గా ఆలోచించినా సమ్మతంగా అనిపించదు.

స్నానం చేస్తున్నా అవే ఆలోచనలు మదినిండా కమ్ముకుంటున్నాయి. అసలు విషయం చెప్పేస్తే అతను హర్ట్ అవుతాడేమో? ఇన్నాళ్ళ తర్వాత ఇండియాకొచ్చి సెటిల్ అవుదామని, మేనరికం కలుపుకుందామని చూడబోతే అదే మెయిన్ ఇంటెన్షన్‌తో వచ్చారని తెలిసిపోతోంది.

ఏదైనా అనని! నేను బతుకుతోంది నాకోసం. అంతకు మించి సుహాస్ కోసం. సుహాస్ ఎంత డైనమిక్‌గా వుంటాడు! ఓపక్క ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ చదువుతూనే మరో పక్క యూనివర్సిటీ హాకీ టీమ్‌లో యాక్టివ్ ప్లేయర్. అన్నిటికీ మించి అతని సెన్స్ ఆఫ్ హ్యూమర్...మాట్లాడుతుంటే అసలు టైమే తెలీదు. అతనికున్న ఇమేజ్ చాలా ఎక్కువేగానీ, నేనేం తీసిపోలేదు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో 'మిస్ యూనివర్సిటీ' క్రెడిట్‌తోపాటూ "మైత్రీ ఐ లైక్ యూ! మైత్రీ! నువ్వు లేకపోతే బతకలేను!" అన్న లవ్ లెటర్ల ప్రాథమిక స్థాయి నుండి దూరంగా వచ్చినాక మనసు విప్పి మాట్లాడగలిగిన ఏకైక వ్యక్తి సుహాస్. నాకు తెల్సి అతనికి నన్ను మించిన డియరెస్ట్ పర్సన్ ఎవరూ లేరు. అసలన్నీ ఒక ఎత్తయితే స్టేట్స్‌లో హాయిగా విహరించటానికెంతదృష్టం కావాలి. మన జిడ్డు ఫెలో మాత్రం ఇండియాలోనే వుంటానంటూ ఇటు పడ్డాడు (ఎంతైనా జిడ్డు కృష్ణమూర్తి అభిమాని గదా!)

సుహాస్ మాత్రం టోఫెల్ రాస్తానని చెప్పాడు. పో! తనకలలు నిజం కాబోతున్నాయి. మధ్యలో ఈ అపశృతే మిటి? ఏమనుకున్నా తన మనసులో మాట చెప్పేయాలి. ఇంకా మించిపో లేదు. దృఢంగా నిశ్చయించుకొని డ్రస్ చేసుకుని బయటికి వచ్చాను.

ఉష శశి సూట్‌కేస్ తెరిచి ఏవో కామిక్స్ దానికి తెచ్చినవి చదువుకొంటోంది. ఇంకేం పుస్తకాలున్నాయా అని చూశాను. 'లింక్ కథలు', ఇంకేవో ఫిలాసఫీకి సంబంధించినవి.

"నువ్వెక్కడి మనిషివయ్యా బాబూ! అమెరికా నుంచి వస్తున్నావు గదా. యే జేమ్స్ హాడ్లీ ఛేజ్‌దో సరికొత్త నవల గానీ, లేకపోతే ఏ షిడ్నీ షెల్డాన్ లేటెస్ట్ డూమ్స్ డే కాన్స్పిరసీనో అథమపక్షం ఏదో ఒక ఇన్నోవేటివ్ బుక్ తెస్తున్నావేమో అనుకుంటే వీటితో కాలక్షేపం చేస్తున్నావా? అయినా అసలిది నీకెవరు పంపించారు ఇక్కడి నుండి. వాళ్ళకి బుద్ధి లేదు ముందు" చిరుకోపంతో అన్నాను.

"అది నా అభిరుచి! నీకు కావాలని ఏదైనా ముందు రాసివుంటే తెచ్చేవాడిని" క్లుప్తంగా నెమ్మదిగా చెప్పాడు శశికాంత్.

"అయితే మటుకు అవే ఎప్పుడూ చదవాలా? మిగిలిన సాహిత్యం ఓసారి ఎప్పుడైనా చదివితే అసలు వదిలిపెట్టేవాడివి గాదు! అయినా అర్థం చేసుకోలేని వాళ్ళతో నాకెందుకు!"

"నేను అవి కూడా సమానంగా చదివాను. ఇప్పటికీ చదువుతాను. కానీ ఓ అందమైన భావాన్ని అపురూపంగా గుండె లోతుల్లోకి రిఫ్లెక్స్ చేయగల పొటెన్సీ అన్య సాహిత్యంలో నీకంతగా కన్పించదు. చెవులు చిల్లులు పడేటట్టుగా డేవిడ్ లీన్ ఆల్బమ్ అంతా విన్నా, కొండల్లో నెలకొన్న వేంకటేశుని స్తుతిస్తూండే అన్నమాచార్య సంగీత లహరిలో మునిగి తేలినపుడు వచ్చే రిలీఫ్ మాటలలో చెప్పటానికి సరైన పదం దొరకదు. బహుశా మాతృభాష అనేనేమోకానీ అదొక్కటే కారణం కాకపోవచ్చు. నాకు దాని మీదంత ఇంట్రెస్టు లేదు. కానీ నిస్సందేహంగా మన సాహిత్య పటిమ ఇవ్వాళ రేపు అంతర్జాతీయంగా వచ్చే కుప్పలు తెప్పల పుస్తకాలతో సరితూగటమే కాదు ఓ మెట్టు పైనే వుంటుందని చెప్పగలను" ఆవేశంగా చెప్తూ ఒక్క క్షణం ఆగి బాలెన్స్ అవుతూ "మర్చిపోయా! నీ చదువెట్లా వుంది?"

"స్ట్రైట్ యావరేజ్ శశీ! నేను నీలాగా అంత ఆలోచించను శశీ! మిగిలిన రోజులన్నీ సరదాగా తిరుగుతూ ఎగ్జామ్స్ ముందు పుస్తకాలు తీస్తా. ఎప్పుడూ సిక్స్టీ పర్సెంట్‌కి తక్కువన్న సమస్య లేదు. కానీ కాస్త నలుగురితో బతకటం నీకు కష్టమేనేమో. ముఖ్యంగా మాలాంటి సర్కిల్‌తో!"

మళ్ళీ టాపిక్‌లోకి తెప్పించి చురకంటించా!

శశి మాట్లాడకుండా పడుకోటానికి వెళ్ళిపోయాడు. నైటీ సవరించుకుంటూ నేను గూడా బెడ్ రూమ్‌లోకెళిపోయాను.

మర్నాడు శశిని ఎంటర్‌టెయిన్ చెయ్యాల్సిన బాధ్యతని ఉష మీద పెట్టేసి నేను కాలేజీకెళిపోదామనుకున్నా. దాని కింక హుషారే! స్కూలికి డుమ్మా కొట్టేసి 'చిరంజీవి క్యాసెట్' తెచ్చేస్తానని బయలుదేరింది.

సాయంత్రం వచ్చేసరికి శశి కాంపౌండ్‌లో బోగన్‌విల్లా పందిరి దగ్గర ఒక్కడే కన్పించాడు. లోపల ఉష వాళ్ళ ఫ్రెండ్సంతా కేరింతలు కొడుతూ సినిమా చూడటంలో నిమగ్నమయి వున్నారు. ఒక్క ఉదుటున అడిగా "ఏంటి శశీ! డోన్ట్ యూ వాన్ట్ టూ ఎంజాయ్ యువర్‌సెల్ఫ్. నీ కోసమే గదా తెప్పించింది!"

"సారీ మైత్రీ నాకేటైపు కొరుకుడు పడటం లేదు. చిన్నప్పుడెపుడో ఇండియా వదిలేటప్పుడు 'భూకైలాస్' చూశాను. అంటే పౌరాణికాలను ఇప్పటి వాటితో పోల్చటం నప్పదు కానీ, ఇప్పుడొచ్చే సినిమాలన్నింటికీ ప్రేమ మీద ఎంత కాన్సన్‌ట్రేషన్, డిటర్మినేషన్. అసలు వాళ్ళు చూపించేంత పూర్ణమైన ప్రేమ ఇక్కడ ఎగ్జిస్ట్ అవుతుందంటావా మైత్రీ? దేశం సంవత్సరానికి రెండువేల కోట్లు వడ్డీ కడుతూ పీక లోతు ఊబిలో కూరుకుపోయినా ఇక్కడ జనాలకింకో సబ్జక్ట్ సహించదు. సెన్సస్ నివేదికల్లో వెయ్యికి తొమ్మిదొందలిరవైమంది స్త్రీలే కనిపించే ఆన్నియో సెంటిపిస్ నీడలో సల్మాన్‌ఖాన్లు కలల కౌగిళ్ళలో అనిర్వచనీయమైన ప్రేమ తీరపు వుటోపియాలు చూపిస్తారు. అనే కవ్‌ఫర్ మేటరీ శంక క్లాసురూము బెంచీల దగ్గర నుంచి ప్రారంభమైనా కులాలు, మతాల కతీతంగా సాగే పవిత్ర ప్రేమ కథలు ఎగ్జయిటింగ్‌గా వుంటాయి. కట్నాలివ్వుకోలేని మధ్యతరగతి ఆడపిల్లలను భ్రమల్లో వుంచినంతకాలం ఈ ఫార్ములా కొనసాగుతూనే వుంటుంది."

"అంటే మనవాళ్ళు ప్రేమించటానికనర్హులంటావా?" అడ్డుపడి అడిగాను.

"కాదుమైత్రీ! వీళ్ళివ్వాల్సిన దానికంటే చాలా ఎక్కువ ప్రాధాన్యత నిస్తున్నారు. అవసరమైన దానికంటే చాలా రెట్లు ఎక్కువగా. అదీ డూబియస్ భావుకత. వీటిల్లో ఒరిజినాలిటీ వుంటే వుండొచ్చుగాక! కానీ ఓ మాదిరి జీవనం సాగించటానికే చిన్నప్పటి నుండి ఎన్నో కష్టాలు, స్ట్రగుల్ పడే మన దేశంలో జన్యూన్ ప్రేమకెంత ఛాన్స్ వుంది?

నువ్వే చెప్పు—నీ జీవిత కాలంలో ఇంత వరకు ఇదీ కారణం అని చెప్పలేని స్వచ్ఛంద ప్రేమ వివాహాన్ని ఒక్కటయినా చూపించగలవా? దానికి ఖండాలతో, భాషతో, జాతితో గూడా ప్రమేయం లేదు. కనీసం మనిషి నొక్క పర్యాయమైనా చూడకపోయినా ఉవ్వెత్తున స్పందించే రీజన్‌లెస్ ఆహ్లాదకరమైన అనుభూతిని పొందగలగటం సాధ్యమేనా? కానీ అది ప్రాక్టికల్‌గా అందరికీ లభ్యమవక పోవచ్చు. ఇంతకు ముందు చెప్పినట్టు తమకున్న అవకాశాలలో అత్యున్నతమైనదాన్ని ఎవైల్ చేసుకుని తృప్తి చెందుదామనుకొనే ప్రయత్నాన్ని 'ప్రేమ' అంటే తప్పులేదుకానీ అదే నిజమైన, నిర్హేతుకమైన నిడదీయని ప్రేమంటూ చూపించే త్యాగాల కర్థం లేదు. ఇరవయ్యొకటో శతాబ్దంలో కూడా మనిషి వాస్తవికతను సెంటిమెంటల్‌గానో, రంగు రంగుల భ్రాంతిలోనో చూడడం సమర్థనీయమేనా? అవును! అని నువ్వు చెప్పగలిగితే నేను కూడా వాటిని చూడటానికి రెడీ!"

ఉత్త నవ్వుముద్దలా ఇంట్రావర్టులా కన్పించే శశికాంత్ ఇంత మాట్లాడగలడా? అయినా సరదాగా సినిమా చూస్తూ ఎంజాయ్ చెయ్యమంటే ఇంత లెక్చరిస్తాడా? ఏం మనిషి?

"ఏంటి! మాట్లాడవ్?"

"ఆ! ఏం లేదు!" స్వగతం నుంచి తేరుకొని "మన సంస్కృతి గురించి సాహిత్యం గురించి అంత ఇష్టం చూపించావుగదా. అలాగే సినిమాలు గూడా చూస్తావనుకొన్నాను. కానీ రెండున్నర గంటల వినోదం కోసం చూసే సినిమా గురించి అంతెవరూ ఆలోచిస్తారనుకోను"

"కానీ ఆలోచించేట్టు తీస్తున్నారు గదా!" అడ్డుపడ్డాడు.

అబ్బో! ఆవుబాబు! ఒక్కో మనిషి ఒక్కో టేస్ట్ వుంటుంది. కానీ రెండు వేల మైళ్ళ దూరంలో విభిన్న వాతావరణంలో వుంటూ 'ఇండియన్ టిపికల్ ట్రెండ్' గురించి నీకున్న ఎవేర్‌నెస్ సూపర్బ్! వదివే ఈ అభిప్రాయాలు జనాల మీద మాత్రం రుద్దకు ఓ.కే." అంటూ లోపలికొచ్చాను. ఉష కొంటెగా చూస్తూ నవ్వుతోంది. అంతా విన్నట్టుంది దొంగ రాస్కెల్. మధ్యలో లాభం దానికి సినిమా హాయిగా చూసింది! ఆ మహానుభావుని బారిన నేను పడ్డాను. సాయంత్రం ఓ ఫ్రెండు మ్యూజిక్ కన్సర్ట్ వుందని జ్ఞాపకం వచ్చింది. గబగబా స్నానం చేసి తయారై దానికెళ్ళి పోయాను.

ఇంటికొచ్చేసరికి లేటయింది. డాడీ, అత్తయ్య భోజనం చేసి తాంబూలం నములుతూ కబుర్లు చెప్పుకొంటున్నారు. నేను గబగబా డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాను. అమ్మ మాట్లాడకుండా వడ్డిస్తోంది. డాడీనే అత్తయ్యతో అంటున్నారు "నాకేం అభ్యంతరం లేదమ్మాయ్! మా మాటెప్పుడూ అమ్మాయి కాదనదు. కావాలంటే దాన్ని గూడా ఓ మాటడుగు అంతవసరమనుకొంటే. ఎలాగూ ఇంకో మూన్నెళ్ళలో డిగ్రీ అయిపోతుంది కాబట్టి అప్పుడే చేసేద్దాం!" భరోసా ఇస్తున్నట్లు. చూడబోతే అమ్మక్కూడా

కష్టం లాగే వున్నట్టుంది. వాళ్ళకు నామీదున్న నమ్మకం సంతోషం కల్గించినా, ఏదో ఫారిన్‌లో చదివొచ్చాడన్న ఒక్క క్వాలిఫికేషన్ కోసం ఆ 'మూడీ ఫెలో'ని చేసుకోమంటే ఎట్లా! అమ్మో సుహాస్‌ని వదిలిపెడితే ఎంత బాధపడతాడు అతని పంచప్రాణాలు నాపైనే. ఏమైనా అమ్మతో చెప్పేద్దామని గట్టిగా నిర్ణయించుకున్నా.

"అమ్మా"...

"ఏంటమ్మా" అనునయంగా అడిగింది అమ్మ.

"ఏం లేదు... కూర కాస్త వడ్డించు" తడబడ్డాను. ఎలా చెప్పడం?! అందులో అత్తయ్య వింటుండగా రభస ఎందుకని ఓ వైపు ఆలోచన! అయినా అదేదో శశితోనే చెప్పేస్తే సరిపోతుంది. నిజమే ఈజీగా బయటపడొచ్చు! అనుకొంటూ చెయ్యి కడుక్కొని బయటకు నడిచాను. లోపలి నుంచింకా మాటలు వినిపిస్తున్నాయి. "కేవలం వాడు మైత్రి మీది ప్రేమతో దాన్ని చేసుకోవడం కోసమే అక్కడన్నీ వదులుకొని ఇంతదూరం ...."

శశి ఇంట్లో కన్పించలేదు.

"శశేడే ఉషా?"

నెమ్మదిగా మెట్లెక్కుతూ పైకొచ్చాను. శశి వెల్లకిలా పడుకొని చేతులు తలకింద పెట్టుకుని నక్షత్రాల వైపే చూస్తున్నాడు. చూస్తున్నాడో ఏమన్నా ఆలోచిస్తున్నాడో చెప్పడం కష్టం!

నెమ్మదిగా దగ్గరకొచ్చి పిల్చాను "శశీ!"

ప్రశాంతంగా చూశాడు.

"నీకో విషయం సూటిగా చెప్పాలి. నేను సుహాస్ అనే వ్యక్తిని గాఢంగా ..."

"నాకు తెలుసు మైత్రీ!" భావరహితంగా చెప్పాడు శశి. "పొద్దున ఉష ఏవో మాటల మధ్యలో చూచాయగా చెప్పింది. నేనర్థం చేసుకోగలను, 'ఇష్టపడే తత్వాన్ని' విశదీకరించగలను గానీ, ఎవరో ఇద్దరిష్టపడి పెళ్ళి చేసుకొంటుంటే అడ్డుపడే మూర్ఖుణ్ని కాను. నిజానికిక్కడికి బయలుదేరి వచ్చేముందు నా ఆశలన్నీ వేరైనా, ప్రస్తుతం నేను దేనికీ చింతించడం లేదు. శాన్ ఫ్రాన్సిస్కో యూనివర్శిటీలో లెక్చరర్‌గా నన్ను ఎప్పాయింట్ చేసుకొంటారన్నారు. అక్కడే రీసెర్చి కూడా యథావిధిగా చేసుకోవచ్చు. ఎల్లుండే బయలుదేరి వెళ్తున్నాను. ఎనీవే! ఆల్ ది బెస్ట్. ఏ విషయంలోనైనా 'బెస్ట్ ఆఫ్ ది ఛాయిస్' లేకపోతే నిజంగానే ప్రేమో కనీసం తేల్చి నాకు నువ్వు చెప్పుకొని చెయ్యి. ఓ.కే."

అలాగే సూటిగా చెప్పాడు. ఆశ్చర్యపోవడం నా వంతైంది. తేరుకొని "మాది నువ్వు చెప్పినంత గొప్ప సూత్రబద్ధమైన ప్రేమ కాకపోవచ్చుగానీ, యే ప్రలోభాలూ లేని నిజమైన ప్రేమేనని నమ్ముతున్నాను శశి. థాంక్స్ ఎలాట్! నువ్వు ప్రాబ్లెమ్ క్రియేట్ చెయ్యనెప్పుడూ" పొగుడుతూ దిగి కాంపౌండులో కొచ్చాను.

దక్షిణపు గాలి చల్లగా తాకి వెళ్ళిపోతోంది. కొబ్బరాకుల్లోంచి మంచు బిందువులుగా నేల జారుతోంది. రెక్కల్లార్చుకొంటూ నవ్వుకొంటున్న పక్షులు ఎందుకో శశి సాయంత్రం చెప్పిన మాటలే గుర్తొస్తున్నాయి. చిన్నమ్మ చంద్రంతో ఎందుకు లేచిపోయింది. వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారుకాబట్టి! కాదు దాని తాహతుకు చంద్రం గాడిని మించి అంత అనువుగా వుండే భాగస్వామి దొరకదు కాబట్టి వాడితో జీవితం పంచుకోటానికి ఇష్టపూర్వకమైన రాజీపడ్తోంది. అంత కుమించిన అవకాశాలని ఆ మనసూహించలేదు. అలా అద్భుతాలు జరగడం వాస్తవంలో ఎన్నడూ కుదరదు కాబట్టి. దాదాపు ఎవ్వరూ స్వచ్ఛందమైన ప్రేమాన్వేషణలో సఫలమవలేకపోవచ్చుకానీ అందరూ దాని భ్రాంతిలో తృప్తిని పొందుతున్నారు.

ఆనందమయంగా జీవించడానికదొక్కటి చాలు. అది జీవితాంతం వుంటే అంతకుమించి ఏం కావాలి? ఫీ ఇన్వాళేమిటి? నేను కూడా శశిలా ఆలోచిస్తున్నాను... శశినంటే ఎలాగో ఒప్పించాం! అమ్మ సంగతేంటి? అత్తయ్య సంగతేంటి. వాళ్ళీ పెళ్ళి జరిగిపోతుందనే మూడ్‌లో వున్నారు. ఇప్పుడీ సంగతిని చెప్తే అసహ్యంగా రభసవుతుందేమో — ఏదైతే అదైంది కానీ ఈ ఆలోచన బావుంది. రేపెల్లి సుహాస్‌తో మాట్లాడి తక్షణం రిజిస్టర్ మారేజ్ చేసుకొని ఇంటికొచ్చేస్తే ముందు తిట్టినా, డాడీ సంగతి తెలుసు – మనకెప్పుడూ ఫ్రేండే! అమ్మెలాగైనా ఒప్పుకొంటుంది చివరికి. అత్తయ్య బాధ వదిలిపోతుంది. అన్నింటికీ మించి శశి అనుకొంటున్నంత అల్పమైన స్థాయిలో మా రిలేషన్స్ లేవని బలంగా నిరూపించాలనిపిస్తోంది.

***

మర్నాడు శనివారం హాఫ్ డే నే కాలేజి. మధ్యాహ్నం డైరెక్ట్‌గా సుహాస్ వాళ్ళింటికెళ్ళాను. అక్కడ వాళ్ళ నాన్నగారు, చెల్లి, అతను మంచి డిస్కషన్‌లో వున్నారు. చెల్లెలి కేదో మంచి సంబంధం వచ్చింది. చేసేద్దామంటాడు సుహాస్. తనేమో ఇంకా చదువుకోవాలని వుంది, తర్వాత చేసుకుంటానంటుంది. తర్వాతయినా, ఎప్పుడైనా ఇంతమంచి సంబంధం రావడం కష్టం కాబట్టి, అంతేకాక తర్వాత కావాలనుకుంటే చదువుకోడం అంత సమస్య కాదన్న తండ్రి నిర్ణయానికి సుహాస్ వంత పాడుతున్నాడు.

'ఫరవాలా! గురుడు లైన్ క్లియర్ చేసుకుంటున్నాడు గామోసు పోనీ ఇదీ శుభ-సూచకమే!'

నన్ను చూస్తూనే లేచి "మైత్రీ! ఇప్పుడే వచ్చేస్తా నా రీడింగ్ రూమ్‌లో కూర్చో" అన్నాడు లోపలికెళ్తూ.

డ్రాయింగ్ రూమ్ పక్కనే వున్న చిన్న రూమ్‌లో సుహాస్ ఎప్పుడూ చదువుకుంటాడు. ఓ మంచం, రెండు చెయిర్స్ మాత్రమే సర్దాయక్కడ. లోపలికెళ్ళి కూర్చున్నాను.

షర్ట్ వేసుకుని రూమ్‌లోకొచ్చాడు సుహాస్. ఎలాంటి సమస్యల్లో వున్నా చెదరని చిరునవ్వు అతనికి ఎసెట్టే!

ఇంకా ఆలస్యం దేనికి — నా ప్రపోజల్ అంతా చెప్పేశా.

"నువ్వింకోసారి ఆలోచించకపోయావు మైత్రీ! మరీ ఇంత అర్జెంటుగానా?"

"ఇంత అర్జంటుగానూ జరగాలి సుహాస్. లేకపోతే కొంపలంటుకుంటున్నాయి. ఈ పనితో మన బంధాన్ని శాశ్వత బంధమని నిరూపిస్తాను. అందుకే తప్పదు."

"అట్లా కాదు మైత్రీ! కాస్త రేషనల్‌గా ఆలోచించాలి. నేను టోఫెల్ రాస్తున్నాను. ఎయిడ్ వస్తే సరే! రాకపోయినా నోవర్‌సీస్‌తో ఎమ్ఎస్ చేయాలన్నది నా మెయిన్ ఎయిమ్. అప్పటికి నువ్వు మంచి డిగ్రీ సంపాదించి వుంటావు కాబట్టి వుద్యోగం దొరుకుతుంది. అయినా అసలివాళ నీకేమైంది? మరీ విడ్డూరంగా మాట్లాడుతున్నావు మైత్రీ! ఒకవేళ నిన్నింట్లోంచి బయటకెళ్ళిపోమంటే తర్వాత పరిస్థితి ఆలోచించగలవా?"

"అవన్నీ నాకనవసరం! నిక్కచ్చిక నిజమైన ప్రేముంటే తక్షణం రిజిస్టర్ మారేజి మనం చేసుకోవాల్సిందే" నిక్కచ్చిగా చెప్పాను.

"ఛీ! ఏమిటా మొండితనం! ఫ్రాంక్‌గా నన్ను మాట్లాడనీ మైత్రీ! మనలాంటి మధ్యతరగతి ఇళ్ళలో, ఫారిన్ ఎక్స్‌ఛేంజి రేట్లు విపరీతంగా వున్న ఈ రోజుల్లో అక్కడి ఎడ్యుకేషనంత సులభం అనుకొన్నావా? నీమంచి కట్నం ఆశించకపోయినా కనీసం సహాయంగానైనా కొంత మానిటరీ బెనిఫిట్ ఆశించడంలో తప్పుందా! అయినా మన ప్రేమెక్కడికి పోతుంది! ముందు స్థిరపడనీ — ఆ తర్వాతే పెళ్ళి విషయం ఆలోచించేది!"

"నో సుహాస్! ఇంటిదగ్గర పరిస్థితులన్నీ నీకు చెప్పాను. అయినా ఏదో వుపాయం ఆలోచిస్తావు గానీ, నేను చెప్పింది చెయ్యడానికి సంసిద్ధంగా లేవు. అదే నీ ఆఖరి నిర్ణయమైతే, నాకూ కొంత బేసిక్ ఐడియాలజీ వుంది. పూర్తిస్థాయి ప్రేమను నేను పొందాలనుకొంటున్నాను కానీ ఇలా పరిస్థితులకు లోబడి కాదు. అలా కానప్పుడు నేనెవ్వరినీ లక్ష్యపెట్టను. చెప్పు ఏమంటావు?" తేల్చెయ్యడమే మంచిది.

"నువ్వూటికీ అలా వద్దంటాను" కోపంగా గట్టిగా అన్నాడు.

"ఓ.కే. నేనింకేం చెయ్యలేను. గుడ్ బై" అంటూ బయటకి నడిచాను. మనసంతా మ్లానమైపోయింది. ఏం జరక్కపోయినా ఏదో అవమానం జరిగిన ఫీలింగ్. తలంతా భారంగా అన్పించింది. తను ఇన్నాళ్ళు నమ్ముతూ వచ్చిన ఓ అందమైన నిజాన్ని అబద్ధం అని ఎవరో నొక్కేస్తే కలిగే షాకు లాంటిది. అలాగే ఇంటికొచ్చాను. సాయంత్రం కనుచీకటి పడుతోంది. వరండాలో కుర్చీ వుంటే చెప్పులు కూడా విప్పకుండా అలాగే కూలబడిపోయాను.

'ఎంత గొప్పగా వూహించాను. అయినా తనదే తప్పు. సుహాస్ యావరేజి మనుషుల్లో ఓ ఎబవ్ యావరేజి పర్సన్ అంతే. తనకి వున్న అందం, క్వాలిఫికేషన్, డాడీ ఎమ్ఆర్ఓ అవడం అతనికో గుడ్ ఛాయిస్. తనకున్న పరిధిలో సుహాస్ 'బెటర్ ఆఫ్ ది వర్స్ట్'! అతను తన బాధ్యతలన్నీ దించుకుని, కావల్సిన చదువులన్నీ అయ్యాక, వుద్యోగమెక్కడో సంపాదించుకొని అప్పుడు తనని పెళ్ళి చేసుకొంటాడు. అంతవరకూ తను అలా కలలు కంటూ వుండిపోతుంది. ఈ మాత్రం ఎంపిక పెద్దవాళ్ళు కుదిర్చే పెళ్ళిళ్ళలో జరగట్లేదా? అదే అయితే నాలోజులు సరదాగా సినిమాలకు, షికార్లకు తిరగడానికి 'ప్రేమ' అని పెద్ద పేరు పెట్టి వంచించుకోనవసరం లేదు. అబ్బ ఎంత చక్కగా చెప్పావు శశీ!

అన్నట్టు శశి! ఖండాంతరాల్లో వున్నా ఇక్కడి సాహిత్యపు పోకడలంటే ప్రాణం

పెద్దాడు. మనుషులెవ్వరితో సరిగా మాట్లాడడం రాకపోయినా అందరి మనస్తత్వాలను ఎనలైజ్ చేయగల నేర్పరి! మరింత సుఖంగా జీవించడానికవకాశమున్నా గూడా స్వదేశం పైన మక్కువ చావనివాడు ... అన్నింటినీ మించి తనంటే ప్రాణమివ్వగల ఆపేక్షతో అన్ని వేల మైళ్ళ దూరం నుండి వచ్చాడు. కేవలం చిన్నప్పుడు మాట వరసకన్న మాటల జ్ఞాపకాల పరంపరలో మరేదో తెలీని అవ్యక్తమైన మమతాపాశమే ఇన్ని సంవత్సరాల నుంచి అతని హృదయాన్ని తన మీద నుంచి పక్కకు మరల్చలేకపోయాయి. పూర్తి విభిన్నమైన స్వేచ్ఛా ప్రక్రియ నాగరికతల మధ్య నుంచి ఓ భావుక హృదయం తననారాధిస్తోందంటే నమ్మశక్యంగా లేదు. తనకే ముందనయినా! ఇంతకుమించి నిజమైన ప్రేమంటూవేరే వుంటుందా? బహుశా ఇదేనేమో? నిజానికి శశి ఎంత పరిపక్వంగా ఆలోచించగలడు. నీముందు, నీ ఆలోచనల స్థాయి ముందు మాతో చిన్న ప్రపంచం శశీ! ఇక్కడ సుహాస్ లాంటి అతి సగటు మంచి వ్యక్తులు మా హీరోలు. దోసిళ్ళకొద్దీ ప్రేమామృతాన్ని ఆస్వాదించాలనే మా రంగుల కలల పరంపరలో కొందరం తృప్తిగా జీవిస్తాం. ఆ అజ్ఞానమలా వున్నంత కాలం మేం దేవుడికి కృతజ్ఞులం. ఇలా ఆలోచిస్తుంటే ఎందుకో వాళ్ళెవరి మీద కోపం రావట్లేదు. నా మీద నాకే కోపం, జారి 'హిమవన్నగ సదృశమైన వ్యక్తిత్వం గల' నీ చెయ్యి పట్టుకొనే తాహతు నాకుందంటావా శశీ... మర్చిపోయా తాహతుకు కారకాలు అక్కర్లేదంటావు గదా ...' ఎందుకో కట్టలు తెగి పొంగినట్లు కళ్ళుమంచి నీళ్ళు కారుతున్నాయి.

ఎప్పటి నుంచి వున్నాడో అక్కడ శశి "ఏంటి మైత్రీ అలా కూర్చున్నావు, నేనేం డిజప్పాయింట్ అవలేదు. అయినా నేను ఇండియాలో ఎలా ఎడ్జస్టవగలను చెప్పు. అలా వుంటానని చెప్పడం అంతా సరదాగా చెప్పేఅబద్ధం. నా చదువుకిక్కడ వుద్యోగమెలాగూ దొరకదు పైపెచ్చ నేను చెప్పేది అంత ఓపిగ్గా ఎవరూ వినరు. అందుకని నేనసలు ముందుగానే నిర్ణయించుకున్నా అక్కడే వుందామని. సరే అమ్మా నాన్నా వస్తున్నారు గదా అని నేను కూడా వచ్చాను.."

తను తలవంచి కూర్చోవడం మూలాన కన్నీళ్ళు కనబడలేదు. శశి వాతావరణం తేలిక చేయడం కోసం అట్లా మాట్లాడుతున్నాడని తెలుసు. అసలతను చెప్పే దాంట్లో ఎంత అబద్ధముందో ఆలోచించట్లేదు తను. తన కారణంగా ఇంకోళ్ళు బాధ పడుతున్నారన్న ఫీలింగ్ భరించలేని సెన్సిటివిటీ అతనిలో చూస్తోంది.

"ఏంటి మైత్రీ మాట్లాడవు?" దగ్గరకొచ్చి అడిగాడు శశి. ఏం మాట్లాడను! అప్పటికే అంతరంగాల సుడుల నుంచి ఉవ్వెత్తున ఎగిసిన ఆర్ద్రిత కన్నీరై పెల్లుబికుతుండగా "శశీ!" అని చుట్టేశాను.

ఆ స్పర్శ వర్షించిన అనుభూతి అగాధ సప్త సాగరాల ఆర్ద్రగీతి

తన కన్నులలో కన్పించే భావాన్నిట్టే పసిగట్టగలడు శశి.

"ఐ లవ్ యూ శశీ .. ఐ లవ్‌యూ ఇన్‌డీడ్. ఇన్నాళ్ళుబట్టి అర్థం కాని మహాతత్వం నాకు బోధపడింది" తమకంగా అంటున్నాను. "బెస్ట్ ఆఫ్ ఛాయిస్ కాదు శశీ – నూటికి నూరుపాళ్ళ ప్రేమే నని చాటిచెప్తా!"

"ఇదంతా నిజమేనా మైత్రీ! అప్పుడే నీలో ఇంత మార్పా!

"చాలా కష్టమేనే! రేపింకో రకమైన ఛేంజుండదు గదా!" కొంటెగాఅన్నాడు.

"ఛీ శశీ! ఇంకా ఎందుకు దెబ్బ తీస్తావు" అంటూ అతని మాటని నా పెదిమలతో ఆపు చేశాను.

ఆకులు రాల్చుతోందో హరితవృక్షం

పెదవులపై పండు వెన్నెల ప్రమరణలు

రాత్రినావరిస్తోంది శుక్లపక్షం. పడమటి సీమల కనువిందు చేసి మరుగైఇటు తూర్పునపైకి లేస్తున్న చందమామ సిగ్గుపడుతూ చూస్తున్నాడు.

శశి ఛ.. బావ నిజంగా నా జీవితంలో వెన్నెల జల్లులు కురిపించే పశ్చిమాల జాబిల్లి!

●●


ఎక్కువ
శీకాయ
+
ఉసిరికాయ




గోద్రెజ్ ప్రవేశపెడుతున్నారు కొత్త కేశ సంరక్షణ సాధనం.

గోద్రెజ్ సోప్స్, అంటే శ్రేష్ఠమైన సబ్బుల అమ్మకంలో అగ్రగణ్యులు ఈ మధ్యనే ఒక కొత్త శికాకాయ్ సబ్బును ప్రవేశపెట్టారు. గోద్రెజ్ శికాకాయ్ అనబడే ఈ సబ్బు మరే ఇతర శికాకాయ్ సబ్బు కన్న విభిన్నమైనది. ఇందులో, చాలా ఇతర శికాకాయ్ సబ్బుల కన్నా ఎక్కువగా శీకాయ దినుసు ఉంది. అంతేకాదు, ఇందులో ఉసిరిక సారం, అంటే సబ్బులలో మొట్టమొదటి సారిగా చేర్చబడిన దినుసు, కూడా ఉంది. ఇలా ఉసిరిక చేర్చబడడం వల్ల గోద్రెజ్ శికాకాయ్ సబ్బు ప్రత్యేకమైనదైంది. దట్టమైన, నల్లటి, పొడవాటి, పట్టులాంటి కేశ సంపద కోసం తహతహలాడే భారతీయ స్త్రీల సౌందర్య సంరక్షణ అవసరాలను తీర్చడానికి యోగ్యమైంది.

తమ శిరోజాల కోసం శీకాయను, ఉసిరిక కాయను ఉపయోగించడానికి సదా ప్రయత్నిస్తుండే భారతీయ స్త్రీలకు వీటి వల్ల కలిగే లాభాల గురించి అనాదిగా తెలుసు. అయితే, ఈ దినుసులనిప్పుడు సౌకర్యవంతమైన సబ్బు రూపంలో అందుబాటులోకి తేవడమైంది. ఇందుమూలంగా స్త్రీలందరికీ కేశ సంరక్షణ కొక సులభమార్గం లభించింది.

కొత్త గోద్రెజ్ శికాకాయ్ ఒక సంపూర్ణమైన సబ్బు. ఎందుకంటే, ఇందులోని శీకాయ దినుసు వెంట్రుకల్ని సహజంగా శుభ్రపరుస్తుంది. ఉసిరిక దినుసు వెంట్రుకల్ని కండీషన్ చేస్తుంది, వాటి కుదుళ్లకు బలాన్ని, పుష్టిని ఇచ్చి వెంట్రుకలు రాలడాన్ని నివారిస్తుంది.